క్లుప్తంగా

యోగాపై అవగాహన ర్యాలీ



మిందిలో యోగాపై అవగాహన కల్పిస్తున్న హోమియో వైద్యురాలు డాక్టర్ శ్రీదేవి

అక్కిరెడ్డిపాలెం: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని హోమియో వైద్యురాలు రాపేటి శ్రీదేవి అన్నారు. జూన్ 26న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మిందిలో ర్యాలీ ద్వారా ప్రజల్లో యోగాపై అవగాహన కల్పించారు. యోగా సాధన వల్ల ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పాడి రైతులకు రాయితీపై దాణా



పాడిరైతులకు దాణా అందజేస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

అగనంపూడి: అగనంపూడి పరిసర ప్రాంతంలోని రైతులకు రాయితీ పై పశువుల దాణా అందించారు. అగనంపూడి పశువుల ఆస్పత్రి ఆవరణలో పాడి రైతలకు 50 శాతం రాయితీ ధరకు వీటిని అందించారు. 45 మంది రైతులకు 120 బస్తాల దాణా అందించినట్టు పశువైద్య నిపుణురాలు డాక్టర్ లావణ్య తెలిపారు. సహాయకుడు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వర్ధినికి చిత్రకళా అవార్డు



సాయి వర్ధినిను అభినందిస్తున్న ఆర్ట్ టీచర్ దానయ్య

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని శివ శివానీ పాఠశాల విద్యార్థిని ఒమిక సాయి వర్ధినికి జాతీయ స్థాయి బాల చిత్రకళా అవార్డు లభించింది. విజయవాడకు చెందిన డ్రీమ్ ఆర్ట్ అకాడమీ ఇటీవల జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో దక్షిణ భారత దేశానికి చెందిన వందలాది మంది బాలబాలికలు పాల్గొన్నారు. ఇందులో సాయి వర్ధిని ప్రతిభ కనబరిచి బాల చిత్రకళా అవార్డు గెలుపొందింది. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఆర్ట్ టీచర్ డి. దానయ్య యాదవ్‌లు సోమవారం అభినందించారు.

నిత్యావసర సరకుల వితరణ



నెలకు సరిపడా బియ్యం, రేషన్ సరకులు అందిస్తున్న దాతలు

అగనంపూడి: ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఇద్దరు కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాలకు నెలకు సరిపడా బియ్యం, నిత్యావసర సరకులు అందించారు. 85వ వార్డు చట్టివానిపాలెంలోని శ్రీకృష్ణా యువజన సేవా సంఘం, పీకే చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ పల్లా కార్తీక్ వీటిని అందించారు. కార్యక్రమంలో ఎం.కోటేశ్వరరావు, బి.సత్యనారాయణ, ఎం.అప్పలరాజు, సీహెచ్.దేముడు, ఎం.అప్పారావు, వెంకట అప్పారావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన




పావనిని అభినందిస్తున్న కళాశాల చైర్మన్ బలరామకృష్ణ

అక్కిరెడ్డిపాలెం: టీఎస్సార్, అండ్ టీబీకే కళాశాల విద్యార్థిని టి.పావని బీకాం కంప్యూటర్స్‌లో ఆంధ్రయూనివర్సిటీ పరిధిలో 3వ ర్యాంకు సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధనరావు తెలిపారు. సోమవారం జరిగిన అభినందన సభలో కళాశాల చైర్మన్ టి.బలరామకృష్ణ పావనికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుభాషిణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వినోదం

- కానరాని సాంస్కృతిక కార్యక్రమాలు
- నిధులు విడుదల చేయని యాజమాన్యం
- గాడితప్పిన నిర్వహణ
- కేవలం దినపత్రికలకే పరిమితం
- కళ తప్పిన ఉక్కు సీడబ్ల్యూసీ

రెండు వార్డులు... 20 నిర్వాసిత కాలనీలు... 1500 మంది ఉక్కు కార్మికులు..500 మంది కాంట్రాక్ట్ కార్మికులు, కల్చరల్ సొసైటీ కార్మికులు.. వీరికి వినోదం.. ఆహ్లాదం... మానసిక ఆనందం కోసం ఏర్పాటు చేసిన సీడబ్ల్యూసీ నేడు దినపత్రికలకే పరిమితమైంది. ఆహ్లాదం, ఆనందం అందని ద్రాక్షగా మారింది. వినోదం మాటే వినపడడం లేదు. సాంస్కృతిక కార్యక్రమాల సంగతే మర్చిపోయారు.దీనిపై నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. - అగనంపూడి



సీడబ్ల్యూసీ అధికారిక కమిటీ వివరాలు



రంగులు వెలిసిపోయి కళావిహీనంగా సీడబ్ల్యూసీ

అగనంపూడి, దువ్వాడ పరిధిలోని నిర్వాసితులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులకు వినోదం పంచడంతో పాటు మానసిక ఉల్లాసం కోసం అగనంపూడిలో మూడు దశాబ్దాల కిందట సామాజిక సంక్షేమ కేంద్రం (సీడబ్ల్యూసీ)ను ఏర్పాటు చేశారు. దీని నిర్వహణ కోసం ఈ పరిధిలోని ఉక్కు ఉద్యోగుల జీతం నుంచి నెలకు రూ. 5, యాజమాన్యం రూ.5 కలిసి ఆ మొత్తాన్ని కమిటీకి అందజేసేవారు. ఈ నిధులతో దినపత్రికలు, నిర్వహణ ఖర్చులు, ఆఫీస్ బాయ్ జీతం చెల్లించాలి. జాతీయ పండగలు, ఆర్ఐఎన్ఎల్ వ్యవస్థాపక దినోత్సవం సమయంలో, వివిధ పండగల్లోసాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఉక్కు యాజమాన్యం ప్రతీ కార్యక్రమానికి కొంత మొత్తాన్ని చెల్లించేది.

ప్రైవేటీకరణ తెరపైకి రావడంతో గడ్డు పరిస్థితి

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం తెరపైకి వచ్చినప్పటి నుంచి సీడబ్ల్యూసీ గడ్డుపరిస్థితి ఎదుర్కొంటుంది. యాజమాన్యం ఆరేళ్ల నుంచి కార్మికుల జీతం నుంచి కోత విధిస్తున్న మొత్తం నిధులను సరిగ్గా కమిటీకి చెల్లించడం లేదు. దీంతో నిర్వహణ భారంగా మారే పరిస్థితి ఏర్పడింది. అరకొరగా కార్మిక సంఘాలు నిర్వహించే సమావేశాలకే సీడబ్ల్యూసీ వేదికగా మారిపోయింది.

ఏదీ నాటి వైభవం...



సీడబ్ల్యూసీ నిర్వాసితులకు స్వయం ఉపాధి కోర్సులకు వేదికగా, యువత, మహిళలకు ఆసరాగా ఉండేది. నిర్వాసితులకు వినోదం, ఆహ్లాదం అందించే వనరుగా ఉండేది. నేడు కళావిహీనంగా మారడం బాధ అనిపిస్తుంది. కనీసం సీడబ్ల్యూల్లో జాతీయ పండగ సందర్భాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు వీలుగా నిధులు విడుదల చేసి పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేలా చూడాలి.

– ముచ్చి రాము, నిర్వాసిత యువత

నాడు సందడే.. సందడి

- గతంలో స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం, గాంధీ జయంతి, అంబేడ్కర్ జయంతి వంటి జాతీయ పండగలతోపాటు రాష్ట్ర అవతరణ దినోత్సవం, ఆర్ఐఎన్ఎల్ వ్యవస్థాపక దినోత్సవం, సంక్రాంతి వంటి పండగలకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేవారు. పదవీ విరమణ పొందిన కార్మికుల్ని ఘనంగా సత్కరించేవారు.
- ఉక్కు సీఎస్ఆర్ నిధులతో స్థానిక నిర్వాసిత మహిళలు, యువతకు స్వయం ఉపాధి శిక్షణా తరగతులు నిర్వహించేవారు. కుట్టు మిషన్లు, అంబ్రాయిడరీ, డ్రైవింగ్ వంటి స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు కుట్టుమిషన్లు, డ్రైవింగ్ లైసెన్స్‌లు, కార్డు అందించేవారు. ఇవన్నీ గతం. నేడు దినపత్రికలకే పరిమితమైంది. ఇవేవీ నేడు కానరావడం లేదు. వీటి ద్వారా నిర్వహించే కార్యక్రమాలేవీ కనపడకపోవడంతో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, నిర్వాసితులు, నిరుద్యోగ యువత మండిపడుతున్నారు.

త్యాగానికి ఇదా బహుమతి?



సీడబ్ల్యూసీ అనేది నిర్వాసితులు, కార్మికుల సంక్షేమాన్ని చూడాలి. కనీసం సంక్షేమం మాటెలా ఉన్నా జాతీయ పండగలు నిర్వహించడానికి కూడా నిధులు విధిలించకపోవడం జాతి పట్ల యాజమాన్యానికి, కేంద్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏంటో తెలియజేస్తుంది.

–మొదలవలస శ్రీనివాసరావు, ఫార్మాసిటీ కాలనీ

ఉధృతమవుతున్న ఉక్కు కార్మికుల సమ్మె



శిబిరంలో ఆందోళన చేస్తున్న కార్మికులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన సమ్మె రోజురోజుకు ఉధృతమవుతోంది. దీనిలో భాగంగా కర్మాగారంలోని అన్ని విభాగల్లో పనిచేస్తున్న కార్మికులంతా సమ్మెలో పాల్గొంటున్నారు. వారికి మద్దతుగా విశాఖలోని ఇతర కార్మిక సంఘాలు కూడా నిలుస్తున్నాయి. దీంతో కూర్మన్నపాలెం ముఖ్యకూడలి సోమవారం కార్మికుల ఆందోళనలు,నినాదాలతో మార్మోగిపోయింది. విశాఖ ఉక్కు కర్మాగార పరిరక్షణకోసం అఖిల పక్ష కార్మిక సంఘాలు పోరాట కమిటీగా ఏర్పడి చేపట్టిన దీక్షలు సోమవారం నాటికి 1500 రోజులు పూర్తయింది. ఇది ఇలా ఉండగానే కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిరసిస్తూ కాంట్రాక్ట్ కార్మికులు చేపట్టిన సమ్మె ఏడో రోజుకు చేరింది. మొదట్లో కొంత స్తబ్ధంగా ఉన్నా రాష్ట్ర స్థాయి పెద్దలు మద్దతు పలకడంతో రోజు రోజుకు బలోపేతం అవుతోంది. ఇప్పుడు కార్మికల హాజరు శాతం తగ్గిందన్న వాదన కూడా వినిపిస్తుంది. సమ్మెకు వైఎస్సార్‌సీపీతో పాటు వాపపక్ష పార్టీలు మద్దతు తెలపడంతో ఆందోళనలో పాల్గొంటున్న కార్మికుల సంఖ్య గణనీయంగాపెరుగుతుంది. సోమవారం నిర్వహించిన శిబిరంలోఅధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని ఉక్కు యాజమాన్యానికి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

సమ్మెపై యాజమాన్యం స్పందించాలి



ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ గౌరవాధ్యక్షుడు అయోధ్యరామ్

ఉక్కునగరం: కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింప చేయాలని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్, ప్రధానకార్యదర్శి యు. రామస్వామి డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల సమ్మెకు మద్దతుగా సోమవారం అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద ధర్నా చేశారు. నాయకులు మాట్లాడుతూ కార్మికుల తొలగింపులు ఆపాలని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని వారు చేస్తున్న పోరాటం న్యాయమైందన్నారు. తక్షణమే యాజమాన్యం స్పందించి కార్మిక సంఘాల నాయకులను చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్మికుల సమ్మె వల్ల ఉత్పత్తి తగ్గుతుందన్నారు. గుర్తింపు యూనియన్ అధ్యక్షులు కె.ఎస్.ఎన్. రావు మాట్లాడుతూ యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికుల పట్ల అన్యాయంగా వ్యవహరిస్తుందన్నారు. స్టీల్ ఇంటక్ అధ్యక్షులు రమణమూర్తి , నాయకులు వై.టి. దాస్, కొమ్ము ప్రసాద్, శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ



రక్తదానం పోస్టర్ ఆవిష్కరిస్తున్న కె.కె. రాజు, దేవన్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు

ఉక్కునగరం: వై.మస్తానప్ప చారిటబుల్ ట్రస్ట్ (వైఎంసీటీ) ఆధ్వర్యంలో జూన్ 1న నిర్వహించనున్న రక్తదాన శిబిరం పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు చేతుల మీదుగా పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా కె.కె. రాజు మాట్లాడుతూ మస్తానప్ప పార్టీ, కార్మిక సంఘాలకు విశేష సేవలు అందించారన్నారు. ఆయన పేరిట కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ ప్రతినిధులు మాట్లాడుతూ మస్తానప్ప 61వ జయంతి సందర్భంగా ఉక్కు క్లబ్‌లో నిర్వహించనున్న రక్తదాన శిబిరంలో అందరూ పాల్గోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ వై. వరలక్ష్మి, జి. అప్పలరెడ్డి, నాగేంద్ర, టి. శ్రీనివాస్, ఎస్. చంద్రశేఖర్, పి. వంశీ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం



వృద్ధురాలి మృతదేహం

అక్కిరెడ్డిపాలెం: గాజువాక బీసీ రోడ్డులోని అరుణోదయ లాడ్జి ఎదురుగా శ్రీ గృహ ప్రియ ఫుడ్స్ మెట్ల మీద గుర్తు తెలియని వృద్ధురాలి మృత దేహాన్ని స్థానికులు గుర్తించి గాజువాక పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న గాజువాక పోలీసులు విచారణ చేపట్టారు. ఆమె వయసు 55 నుంచి 60 ఏళ్లు ఉంటుందని, 5 సంవత్సరాల నుంచి ఆమె అజీమాబాద్, కొత్తగాజువాక, బీసీ రోడ్డు పరిసరాల్లో షాపుల మెట్ల వద్ద నిద్రిస్తుందని తెలిపారు. ఆమె ఎవరు, కుటుంబ వివరాలు తెలియరాలేదు. పోలీసులు మృత దేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎవరైనా గుర్తుపడితే గాజువాక సీఐ 9440796014, ఎస్ఐ 9642364770 నంబర్లకు తెలపాలని కోరారు.

రైల్వేస్టేషన్‌లో 6 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని విశాఖ రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకుని, 6 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలివి.. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో సోమవారం ఆర్పీఎఫ్ ఎస్ఐ ఒబిషేక్ మిస్త్రీ, జీఆర్పీ ఎస్ఐ కె.టి.ఆర్.లక్ష్మి సిబ్బందితో కలిసి రైల్వే స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాల్లో తనిఖీలు నిర్వహించారు. మహారాష్ట్ర పాల్‌ఘర్ జిల్లాకు చెందిన ఇమ్రాన్ నాఫిస్ షేక్ విశాఖపట్నం రైల్వేస్టేషన్ మీదుగా మహారాష్ట్రకు గంజాయి రవాణా చేయడం గుర్తించారు. ఇతడిని అదుపులోకి తీసుకుని, రూ.30 వేల విలువైన 6 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

నేడు అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం అడ్మిన్ బిల్డింగ్ ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నారు. కాంట్రాక్ట్ కార్మికులు ఈ నెల 20 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్న విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఉక్కు యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చే కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న ముట్టడికి కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు కోరారు.

రంజింపజేసిన సినీ సంగీత విభావరి



సినీ గీతం పాడుతున్న గాయకుడు


సీతంపేట: ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవాల్లో భాగంగా స్వరాంజలి, స్వరార్చన కళా సంస్థల ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. సంస్థ గాయనీ గాయకులు అంబిక, కల్యాణి, రంజిత, సుజాత, ఎం.కృష్ణంరాజు, భూమతిరావు, నరసింగరావు తదితరులు ఎన్టీఆర్ నటించిన చిత్రాల్లోని పాటలు పాడి ప్రేక్షకులను రంజింపజేశారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

మద్దిపాలెం: కంచరపాలెం పరిధిలో మద్యం తాగి వాహనం నడిపిన వారిపై పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు సోమవారం ఊర్వశి జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ పలువురు కానిస్టేబుళ్లతో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు, కార్లను ఆపి బ్రీత్ అనలైజర్ టెస్ట్‌లు చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపిన పలువురిపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మళ్లీ అవే కష్టాలు

- ఇంటి వద్దకే రేషన్ పంపిణీకి మంగళం
- మళ్లీ రేషన్ షాపుల వద్ద పడిగాపులు తప్పవని ఆవేదన
- పనులు మానుకుని డిపోలకు తిరగాల్సిందేనంటున్న పేద ప్రజలు



కార్డుదారులకు ఇంటి వద్దే రేషన్ సరకులు అందజేస్తున్న దృశ్యం (ఫైల్)



ఇంటివద్దే రేషన్ సరుకులు అందిస్తున్న దృశ్యం (ఫైల్)

పెదగంట్యాడ: గత ప్రభుత్వం పేదల కోసం ఇంటింటికీ రేషన్ సరకులు పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీంతో పేదలు తమ వీధిలోనే హాయిగా సరకులు తీసుకునేవారు. అయితే కూటమి ప్రభుత్వం ఆ విధానానికి మంగళం పాడింది. జూన్-1 నుంచి మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ)ల ద్వారా రేషన్ సరకులు పంపిణీని రద్దు చేసింది. దీంతో పేద ప్రజల్లో ఆందోళన మొదలైంది. పనులు మానుకుని మళ్లీ రేషన్ దుకాణాల వద్దకు ఉదయం, సాయంత్రం వెళ్లి పడుగాపులు కాయాల్సిన పరిస్థితులు ఎదురుకానున్నాయని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థను తొలగించడంతో పౌర సేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ప్రజలు జూన్-1 నుంచి రేషన్ దుకాణాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

మండల పరిధిలో 19 వాహనాలు

పెదగంట్యాడ మండల పరిధిలో రేషన్ దుకాణాలు 37 ఉండగా, ఎండీయూ వాహనాలు 19 ఉన్నాయి. తెల్ల రేషన్ కార్డులు 32,825 ఉన్నాయి. వీరందరూ ఎక్కువ శాతం కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగించేవారే. ఒక్కో వాహనానికి ఒక ఆపరేటర్, ఒక సహయకుడు ఉంటారు. వాహనానికి ప్రభుత్వం నుంచి నెలకు రూ. 21 వేలు ఇస్తుంది. వీటిలో వాహనానికి సంబంధించి లోను రూ. 3వేలు, ఆయిల్ ఖర్చుకి రూ. 3వేలు, సహాయకుడికి రూ.5 వేలు, ఆపరేటర్‌కి రూ.10వేల చొప్పున గత ప్రభుత్వం నుంచి ఇచ్చేవారు. ఇప్పుడు ఈ వాహనాలు రద్దు చేయడంతో వాటిలో పనిచేసే సిబ్బంది రోడ్డున పడనున్నారు.

మళ్లీ తిప్పలు తప్పవు



రేషన్ సరకులు దుకాణాలకు వెళ్లి తీసుకోవాలంటే మళ్లీ కష్టాలు పడాల్సి వస్తుంది. కూలి పనులు వదులుకుని గంటలకొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితి. ప్రభుత్వం పేద ప్రజల కష్టాలను ఆలోచించి గత ప్రభుత్వం మాదిరిగానే ఇంటి వద్దకే రేషన్ సరకులు అందించే విధానాన్ని కొనసాగించేలా ఆలోచన చేయాలి. – ఎస్ మణి, పెదగంట్యాడ

బావిలో పడి వ్యక్తి మృతి



అప్పలరెడ్డి (ఫైల్)

కూర్మన్నపాలెం: మద్యం మత్తులో ఓ వ్యక్తి బావిలో పడి మృతి చెందాడు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలివి. పాలవలస గ్రామానికి చెందిన గొందేశి అప్పన్నరెడ్డి (41) సోమవారం ఉదయం ఇంటికి సమీపంలోని నేల బావిలో కాలు జారి పడి మరణించాడు. రెండు రోజుల కిందట మద్యానికి భార్య డబ్బులు ఇవ్వలేదని ఇంటి నుంచి అలిగి వెళ్లిపోయాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతుండగా గ్రామస్తులు బావిలో మృతదేహాన్ని గుర్తించిన ఆయన భార్య ప్రమీలకు తెలిపారు. దీంతో ఆమె పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు బావిలోని మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. సీఐ మల్లేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

మానసిక చికిత్స కేంద్రం సందర్శన

మహారాణిపేట: చిన్న వాల్తేరులోని ప్రభుత్వ మానసిక రోగుల చికిత్స కేంద్రాన్ని సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సందర్శించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు అనుమతితో ఆయన కేంద్రంలోని వార్డులను పరిశీలించారు. రోగుల మానసిక స్థితి, వారికి అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. వంట గదిని తనిఖీ చేసి ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ప్రొఫెసర్ డాక్టర్ డి.విజయలక్ష్మి, లీగల్ వలంటీర్ కె.ఉమామహేశ్వరి పాల్గొన్నారు. ఆ తర్వాత సేవాధికార సంస్థ కార్యదర్శి కేజీహెచ్‌లోని వన్ స్టాప్ సెంటర్‌ను సందర్శించారు.

బెహరాలో ఉచితంగా నైపుణ్య శిక్షణ తరగతులు

గోపాలపట్నం: జీవీఎంసీ 88వ వార్డు నరవ బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత నైపుణ్య శిక్షణతరగతులు నిర్వహించనున్నామని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య తెలిపారు. జూన్ 2 నుంచి 11 వరకు ఈ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తరగతు జరుగుతాయని తెలిపారు. పాలిటెక్నిక్‌లో చేరే విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.పాలిటెక్నిక్‌లో ఆసక్తి ఉన్న కోర్సుల్లో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కంప్యూటర్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ వంటి వాటిపై వర్క్‌షాప్ ఉంటుందని చెప్పారు. గాజువాక, మద్దిలపాలెం, గోపాలపట్నం ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం ఉందని తెలిపారు. పూర్తి వివరాల కోసం 84980 53328, 80969 51452, 80741 01825, 63039 53129 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పోర్టు ఎస్సీ, ఎస్టీ సంఘం నూతన కార్యవర్గం కొలువు

దాబాగార్డెన్స్: విశాఖపట్నం పోర్టు అథారిటీ ఎస్సీ, ఎస్టీ అధికారుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా దేవీశ్వరరావు మరోసారి ఎన్నికయ్యారు. కోశాధికారిగా ఎం.సాల్మన్‌రాజు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ టీఎస్ దీప్తి, కె.వేణుగోపాల్, ఈ.వెంకట్రావు, పి.ప్రసన్నకుమార్‌ను, సంయుక్త కార్యదర్శులుగా పి.సుందరేషన్, కె.శ్రీను, సిద్ధార్థకుమార్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎం.ఎస్. రావు, బూరి శ్రీను, సంజీవరావు, కె.వి.రమణతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సీనియర్ సభ్యుడు ఎం.ఎస్.ఎస్. సింగ్ ఆధ్వర్యంలో పోర్టు అసోసియేషన్ కార్యాలయంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో పనిచేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం అందించారు.

పీజీఆర్ఎస్‌కు ఆరు వినతులు



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ హేమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్-8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై ఆరు వినతులు అందాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్ కె.హేమావతి వినతులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు జెడ్సీ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జోన్-8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.